# జడ్జిగారి తీర్పు

"సాగరశ్రీ"

జడ్జీగారికళ్లు అశ్రువులతో నిండిపోయాయి. "మంజులతా నన్ను క్షమించు. నావల్లనే నీకీదశపట్టింది" అని ఆయన గద్గద స్వరంతో అన్నారు. మంజులత ఎవరు? ఆమెతో ఆయనకున్న అనుబంధం............

ఆ రోజు సాయంత్రం నేను వర్కంతాపనిపూర్తి చేసుకొని త్వరగా ఇంటికి వెళ్లదలుచుకొన్నాను శ్రీమతి సినిమాకు వెళ్దామన్న కారణంగా. అందుకే క్లయింటుల నందరిని పంపించేసి నా రూముకు తాళము వేశాను. జడ్జీగారు ఇంటిలో లేరు. ఇల్లు పరసన్నను చూడమని నేను పోబోతున్నాను. 'ఏమండీ జడ్జీగారు ఉన్నారా' అని ఒక స్త్రీ గేటు తెరుచుకొని కాంపౌండ్‌లోనికి వచ్చింది.

ఆ స్త్రీ వయస్సు సుమారు నలభై అయిదు సంవత్సరాలు ఉండవచ్చు. ముఖ కవళికలు చూస్తుంటే పెద్ద కుటుంబములోని దానివలె కన్పిస్తున్నది. సాదరంగా లోనికి ఆహ్వానించాను.

"లేరండి .... అలా బయటికి పనిమీద వెళ్లారు" అన్నాను నేను.

"ఎప్పుడు వస్తారు"

"ఇంకో గంటలో రావచ్చు. మీరు వారి క్లయింటా" ఈ ప్రశ్న నాకు తెలిసే అడిగాను. కారణము లేడీ క్లయింట్సెవరూ లేరు మాకు.

"కాదు."

"అయితే జడ్జీగారు మీకు .... "అని ఆగిపోయాను.

ఆమె ఒకనిమిషం తటపటాయించింది చెప్పటానికి. చివరకు 'బంధువులం' అంది.

నేను ఆశ్చర్యపోయాను. ఐదు సంవత్సరాల నుండి నేనుజడ్జీగారి దగ్గర పని చేస్తున్నాను. వారు తనకు బంధువులే లేరన్నారు. దానికి నిదర్శనంగా ఇంతకాలము నుండి ఒక్కరుకూడ జడ్జీగారింటికి వచ్చినట్లు లేదు. నా కాయనను చూస్తే ఎంతో జాలివేసింది. నా అన్నవారు లేరుగదా యని! వారెంతో మనోవ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకోవటానికి నా కెంతో కాలము పట్టలేదు. అయినా ఆయన నిండుకుండలాంటి మనిషి ఎప్పుడూ లేని ధైర్యము తెచ్చుకుని తిరుగుతూ ఉండేవారు. నే నెన్నోసార్లు అడిగాను. 'మీరెందుకిట్లా మీలో బాధపడతారు. నాతో చెప్పరా' అని. ఆయన గంభీరంగా 'ఆ విషయం తప్పించి ఇంకేదైనా అడుగు చెబుతాను' అనేవారు. అటువంటివారి కీమె బంధువులం అంటుంది.

"వారొచ్చేవరకూ కూర్చుంటారా" అన్నాను.





"...అలాగే" అంది.

"క్షమించండి. నాకు ఇంటిదగ్గర పనుంది. నేను వెళ్తున్నాను. జడ్జీగారు ఒక గంటలో రావచ్చును" అని నరసన్నను పిలిచి "నరసన్నా! జడ్జీగారి బంధువులు వచ్చారు చూడరా" అని వాడితో చెప్పి నేను వెళ్లిపోయాను.

ఆ మరునటిరోజు నేను జడ్జీగారింటికి వెళ్లాను. నాకు ఎన్నడూ కలుగనంత ఆశ్చర్యము కలిగింది. నా రూము తీసిఉంది. జడ్జీగారు నా రూములో దేనికొరకో వెదుకుతున్నారు .... ఇంత వరకు జడ్జీగారు నా రూములోనికి ఒక్కసారి కూడ రాలేదు. వారే కాగితం కావలసినను నన్నే అడిగే వారు అటువంటిది ఈరోజు నేను లేనప్పుడు నా రూములోకొచ్చి .... అంత అర్జంటు కాగితా లేమున్నాయి. అందులో ఈరోజు ఆదివారం. నేను అలాగే నిలబడిపొయ్యాను. జడ్జీగారు చిరునవ్వు నవ్వుతూ నావైపు చూసి "ఏం ఆశ్చర్యంగా ఉంది కదూ .... ఎన్నడూ లేనిది నీ రూములోకి వచ్చి నందున ,.... నిన్నటి మర్డర్ కేసుకు సంబంధించిన కాగితాలేవి" అన్నాడు.

నేను ఆ కాగితాలు తీసి యిచ్చాను.



ఆయన గబగబా రెండు మూడుసార్లు ఆ కేసంతా చదివారు.

ఆదుర్దాగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఏమిటో భయం వారి ముఖంలో కన్పిస్తూ ఉంది. నాకేమి చెయ్యాలో తోచలేదు. ఆయన హాలులోకి నడిచాడు. నే ననుసరించాను. ఒక్కసారిగా 'రామం .... ఈ కేసు గురించి నీ అభిప్రాయం ఏమిటి' అన్నారు.

"ఏముంది సార్ ! మర్డర్. సాక్ష్యమంతా చూస్తే ముద్దాయికి మరణశిక్షే" అన్నాను నేను.

"అంతేనా !" అని నీరసంగా కుర్చీలో కూలబడి పొయ్యారు.

నాకేమీ పాలుపోవటంలేదు.

ఇంతలో నిన్నటి సాయంత్రం వచ్చిన స్త్రీ వచ్చింది.

"రండి ! రండి!" అని లోనికి ఆహ్వానించాను.

ఆమె వచ్చి కుర్చీలో కూర్చున్నది.

జడ్జీగారు ఆమె వంక ఒకసారి చూచి మళ్లీ తల దించేశారు.

"రామం ! ఎన్ని రోజులనుండో నా కథ చెప్పమంటున్నావుకదూ ! ఇప్పటి కా సమయం వచ్చింది. సావధానంగా విను" అని గద్గదస్వరంతో చెప్పసాగారు. ఆ స్త్రీ కూడా ఆలకిస్తున్నట్లు తోచింది.

## అతను చెప్పినకథ:—

నేను ఆ సంవత్సరమే బి. ఎస్. సి. పాస్యి అయ్యాను. మా అన్నయ్య విశాఖపట్నము కలక్టరు ఆఫీసులో పనిచేస్తున్నాడు. నాకు బి. ఎల్. చదవాలనిపించింది. ఎలాగూ మా అన్నయ్య విశాఖపట్నములో ఉన్నాడు గదా అని ఒకనెలరోజులు ముందుగానే విశాఖపట్నము బయలుదేరాను. మా చెల్లాయి కూడ ఇంటర్మీడియట్ విశాఖలోనే చదువుతానని గోల. ఇహ లాభము లేదనుకుని మా అమ్మను తీసుకొచ్చి విశాఖలోనే కాపురం పెట్టదలిచాము. నేను అనుకున్న ప్రకారం విశాఖపట్నము వెళ్లాను. నా కది కొత్త ప్రదేశము. వారు మాట్లాడేది తెలుగయినా నా కర్థము గావటములేదు. మా అన్నయ్యకు కలక్టరు ఆఫీసులో పని అని చెప్పాను గదూ. నాతో వహాట్లాడటా నికే తీరిక ఉండేది కాదు. విశాఖపట్టణంలో నాకు ఒక్కటే నచ్చింది. అదే ప్రకృతి సౌందర్యము. విశాఖపట్టణ ప్రకృతిసౌందర్యం ఎంత ఆహ్లాదకరంగా, మనోహరంగా ఉంటుందో వర్ణింపవలవిగానిది. ఆ రోజుల్లో నాకు కాస్త కవిత్వపు పిచ్చి ఉండేది. అందుచేత రోజూ లైట్‌హౌస్ కొండమీదికి వెళ్లి కాలము గడుపుతూ ఉండేవాడిని.

యధాప్రకారంగా నేను ఒకనాడు ఒక పుస్తకం కాగితాలు తీసుకుని కొండమీదికి వెళ్తున్నాను. పైనుండి నలుగురు అమ్మాయిలు దిగి వస్తున్నారు. నాకు అమ్మాయి లంటేనే మహా భయము. అందుకని నేనే ప్రక్కకు తప్పుకుని త్రోవ యిచ్చాను.

"లైట్‌హౌస్ ఎత్తు ఎంతండి" తకీమని ఒకమ్మాయి అడిగింది.

నేను తెల్లముఖము వేసుకు చూశాను. 'నన్నేనా అడిగింది' అనుకొన్నాను.

'మిమ్ములనేనండి' మరో అమ్మాయి.

"మాటలు రావేమో."

అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు.

నాకు తలతీసేసినట్లయింది.

ఒక్కసారిగా 'యాభై అడుగులు' అన్నాను.

"కొండ ఎత్తు ఎంతండి" ఇంకో అమ్మాయి.

"సుమారు రెండువందల యాభై గజాలు ఉండవచ్చు."

"మెట్లు ఎన్నండి."

నాకు భలే కోప మొచ్చింది. అయినా తమాయించుకొని "ఇదుగో చూడండి. నేనేమన్నా ఫారెస్ట్స్ అండ్ హిల్స్ సూపర్‌వైజర్ ననుకొన్నారా ?" అన్నాను.

"సారీ ! మీరు కాగితాలు పుస్తకాలు తీసుకొని కొండమీదికి వస్తుంటే లైట్‌హౌస్ ఆఫీసులో క్లర్క్ అనుకున్నాం" అందొక అమ్మాయి.

ఉపాధ్యాయుడు:-ఒరే రామూ, సూర్యవంశం వారెవరో, మరి చంద్రవంశం వారెవరో చెప్పగలవా?

రామూ:-ఈగలను సూర్యవంశం వారని, దోమలను చంద్రవంశం వారని మా తాతయ్య చెప్పాడుసార్.

రొండ్ల వెంకటరెడ్డి (ధర్మాపురం.)

మిగతావాళ్లంతా ఒక్కసారి కిలకిల మన్నారు.

నాకు అరికాలి మంట నెత్తి కెక్కింది. వెంటనే "మీబోటి అమ్మాయిలు రోజుకు ఎంద రొస్తున్నారో లెక్క వ్రాసుకుందామని" అన్నాను. వాళ్ళు మాట్లాడకుండా దిగిపొయ్యారు.

తరువాత పది పదిహేను రోజులకు నేను యూనివర్శిటీలో ఎఫ్. ఎల్. లో జేరాను. విశాఖపట్నంలో మా అమ్మను తీసుకువచ్చి ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాము. మా చెల్లాయి ఇంటర్మీడియేట్‌లో జేరింది.

యూనివర్శిటీ వాతావరణమంతా కొత్తగా ఉంది. అందరూ కొత్త. తెలిసినవాళ్లెవరూ లేరు. అలాగే ఒక నెలరోజులు గడిచిపోయింది. కొంతమంది స్నేహము సంపాదించాను నేను. ఒకనాడు మా స్నేహితులందరూ హార్బరు ఏరియాలో ఉన్న వెంకటేశ్వరాలయమునకు వెళ్దామన్నారు. 'సరే' నని ఒకనాటి సాయంకాలం ఆరు గంటలకు అక్కడి కెళ్లాము.

అంతకుముందే గుడిలో ఎవరో ఉన్నారు, మేమూ లోనికి వెళ్లాము. గుడిలో...ఎవరో ముగ్గురమ్మాయిలు ఉన్నారు. వీరి నెక్కడో చూసినట్లు జ్ఞాపకం .... ఆ ! ఆరోజు కొండమీద చూచినవాళ్ళు. వారిలో ఒకమ్మాయి కళ్లు మూసుకుని ధ్యానంతో దేవునికి నమస్కరిస్తున్నది. పూజారి హారతికొరకు లోనికి వెళ్లాడు.

వెంటనే నేనా అమ్మాయిని చూస్తూ 'శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అన్నాను. మా స్నేహితులంతా ఒక్కసారి గుడి ఎగిరిపోయేటట్లు నవ్వారు. అమ్మాయిల ముఖాలు ఆముదం త్రాగినట్లుగా అయిపోయాయి. అందరం బయటికి వచ్చాము.

ఇంతలో ఆ అమ్మాయి నా దగ్గరకు వచ్చి "ఏయ్ మిస్టర్ నీచెల్లెలెవరయినా ఈమాట లంటే నీ కెలా ఉంటుంది ?" అని కోపంగా అడిగింది.

నేను నవ్వుతూ "ఏమి ? నా చెల్లెలికి నేను పెళ్లి చెయ్యనా ?" అన్నాను.

ఈసారి మా ఫ్రెండ్స్ అంతా మరీ పెద్దగా నవ్వసాగారు.

పాపం ! ఆ అమ్మాయిలు చేసేదిలేక వెళ్లిపోయారు. మావాళ్లు 'ఎంత ధైర్యవంతుడివిరా' అని అభినందించారు.

ఒకసారి నేను జ్వరం వచ్చి ఒక వారం రోజులు కాలేజీకి వెళ్లలేదు. వెళ్లిన రోజున ప్రొఫెసరుగారు తనను కలుసుకోమన్నారు. నాకు గుండె దడదడలాడింది. 'ఏమంటారో .... ఏమో'. సాయంత్రము అయిదు గంటలకు రూముకు కెళ్లాను. ప్రొఫెసరుగారు లేరు. ఇక చేసేదిలేక ప్రొఫెసరుగారింటికి వెళ్లాను.

వరండాలో ఒక యువతి కూర్చుని ఏదో చదువుకొంటూంది.

"ఏమండీ ప్రొఫెసరుగా రున్నారా."

"........"

"ఏమండి .... మిమ్మల్నే."

"లేరు" అంది నావైపు చూసి.

నేను ఒక్కసారి తత్తరపడి పొయ్యాను. ఈమె నేను వెంకటేశ్వరదేవాలయములో ఆశీర్వదించినామే.

నేను గబగబా తిరిగి రాబోతున్నాను.

"ఏయ్....మిస్టర్" ఆమె పిలిచింది. మౌనంగా నేను వెళ్లాను.

"ఆ కుర్చీమీద కూర్చోండి" యాంత్రికంగా కూర్చున్నాను.

"ఇంకెంత మందికి పెళ్లిళ్లు చేసారు ?"

మెత్తటి చెప్పుతో కొట్టినట్లయింది. నేనేమీ మాట్లాడలేదు.

"నాన్నగారితో పనేమిటి .... నా పెళ్లి సంప్రదిద్దామనా."

నేనిక వినలేకపొయ్యాను. ఈమె మా ప్రొఫెసరుగారి కూతురా. చచ్చాను. ఇహ లాభంలేదు. ఇక నేను బి. ఎల్. చదవటము అనవసరము. ఈమె ఈ విషయం తండ్రితో చెబుతుంది. నాకిక బి. ఎల్. ప్యాసయే సూచనలేమీ కనుపించటము లేదు.

నా శరీరమంతా ఒణికిపోతోంది. చెమటతో బనీను చొక్కా అన్నీ తడిసిపోతున్నాయి. నేను కుర్చీమీద కూర్చోలేక పోతున్నాను.

'ఇక్కడి కెందుకు వచ్చావ్రా దేవుడా' అంటూ

కుమిలిపోతున్నాను.

'అదేమిటి .... గాలి లేదా' అంటూ ఫేన్ వేసి వచ్చింది ఆమె

"ప్రొఫెసరుగారు ఎప్పుడు వస్తారు ?" మూతిలోనుండి వెలువడినట్లుంది నా మాట.

"అర్జంటుగా మధ్యాహ్నం ఊరికి వెళ్ళారు. ఒక వారము వరకు రారు" అంది. నేను మరీ నీరసించిపోయాను.

"మేడమ్ .. ఆరో జేదో తెలియక అన్నాను. క్షమించండి. నా జీవితం మీ చేతుల్లో ఉంది "

"అరె ! అదేమిటి అట్లా మాట్లాడుతున్నారు. ఆ విషయం నే నెప్పుడో మర్చిపొయ్యాను."

"ఇదివరకు నే నెవరో తెలియక మర్చిపొయ్యారు. ఇప్పు డది కాదుగా. నా జీవితం మీ చేతుల్లో .... ఈ విషయం ప్రొఫెసరుగారి చెవిన బడితే .... "

"మీ రెవరో నాకు తెలుసు. నళిని బ్రదర్ కదూ!"

అంత నీరసంలోను ఆశ్చర్యం కలిగింది.

"నళిని మీ కెలా తెలుసు."

"మే మిద్దరం ఒకే క్లాసు. ఒకసారి మీ యింటికి వచ్చాను. అక్కడ మీ ఫోటో చూశాను."

"ఆ ! అయితే ఇదివరకే మీ తండ్రిగారితో చెప్పారన్నమాట. అందుకే కలుసుకోమన్నారు. ఇక నేను ఖాళీ" అని కుర్చీలో జారగిలపడ్డాను.

"అరె ! అలా భయపడతారేంటి ? నే నసలా విషయం ఆయనతో చెప్పలేదండీ ! కూర్చోండి. కాఫీ తీసుకు వస్తాను. మా బ్రదర్ వస్తే కాఫీ అయినా యివ్వలేదని నళిని నామీద విరుచుకు పడుతుంది" అంటూ లోనికి వెళ్ళింది.

నాకు కొంచెము ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఈమె తరహా చూస్తుంటె ఈ వ్యవహారమేమీ ప్రొఫెసరు గారికి చెప్పినట్లు లేదు.

'కాఫీ ఎలాగుంది' ఆమె ప్రశ్నించింది.

'బ్రహ్మాండంగా ఉంది. మీ తృప్తి కోసము కాదుసుమా.'

'ఇంకెంతమందికి పెళ్లి చేశారు" చిరునవ్వు నవ్వుతూ అంది.

నేనేమీ సమాధానం చెప్పలేదు. కాస్సేపు కూర్చుని 'మీ పేరు' అన్నాను.

"మంజులత."

"ఏం. అలా అన్నారు."

"ఏమీ లేదండీ. రోజూ మా చెల్లి చెబుతుంది 'మా క్లాసులో మంజులత అనే అమ్మాయి ఉంది అన్నయ్యా. ఉత్తి అల్లరిపిల్ల. లెక్చరర్ని ఐలేగా ఏడిపిస్తుంది. ఏ కొశ్చన్ అడిగితే లెక్చరర్ చెప్పలేడో ఆలోచించి ఆ కొశ్చనే అడుగుతుంది. క్లాసులో ఎంత గోల చేస్తుందో అంతకన్న పది రెట్లు చదువుతుంది. క్లాసులో ఎప్పుడూ ఆమెదే ఫస్టు. అసలు ఎంతగోల ఎక్కడ నేర్చుకుందో. కాన రాకుండా బలే గోల చేస్తుందని.' అయితే ఆ మంజులత మీరేనన్నమాట."

ఆమె చిరునవ్వు నవ్వుతూ "అయితే నళిని నామీద చాల చాడీలు చెప్పిందన్నమాట. రేపు దాని పని పడతా నుండండి. ఇంకేమి చెప్పిందండి.'

"ఇంకేమీ చెప్పలేదండీ" అన్నాను.

"అన్నకు తగ్గ చెల్లెలే లే. అవసరమొస్తే కాళ్ళు పట్టుకుంటారు. అవసరం తీరిం తర్వాత జుత్తు పట్టుకుంటారు" అంది.

"నే వెడతానండి" అని లేచాను.

'సరే' నని ఆమె గేటుదాకా వచ్చి చిరునవ్వుతో సాగనంపింది.

ఆ మరుసటిరోజు ఆదివారం. కాలేజీకి సెలవు. నాకు లోపల బితుకు బితుకు మంటూనే ఉంది. మంజులత వాళ్ల నాన్నగారితో ఈ విషయం చెబుతుందేమోనని. ఆడవాళ్లను నమ్మిం దెవరు ? "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" నాకేమి చెయ్యాలో తోచలేదు. మనశ్శాంతికొరకు మా చెల్లాయితో క్యారమ్సు ఆడుతున్నాను.

'నళినీ' అంటూ మంజులత హఠాత్తుగా వచ్చింది.

"ఓ ! మీరా" అన్నాను నేను అప్రయత్నంగానే.

"మంజులత నీకు తెలుసేమిటి అన్నయ్యా" మా చెల్లాయి అడిగింది.

మంజులత జరిగిన కథంతా చెప్పింది. మా చెల్లాయి ఒకటే నవ్వు.

'అయితే మంజులత నాకంటె నీకే బాగా తెలుసన్నమాట' అంది.

మేమేమీ మాట్లాడలేదు.

కాస్సేపు ముగ్గురం క్యారమ్సు ఆడాము.

ఇంతలో మా చెల్లి 'మీ రాడుతుండండి. నే నిప్పుడే వస్తా' అని లోపలికి వెళ్లింది.

మంజులతను నిన్నటి విషయమే మరల అడిగాను.

'మంజులతా నా కేదో భయంగా ఉంది. మీ ఆడవాళ్లను నమ్మిం దెవరు ? మీ నాన్నతో యీ విషయం చెబుతావేమోనని భయంగా ఉంది.

"అబ్బ ! మీకింకా ఎట్లా చెప్పాలో నాకు తెలీటంలేదు. నేను చెప్పనని మీకు హామీ యిస్తున్నానుగా."

"ఏదీ ఒట్టు వెయ్యి" అని చేయి చాచాను.

ఆమె ఠకీమని చేతిలో చెయ్యి వేసింది.

ఆ సమయంలో నాకంత ధైర్యము ఎక్కడి నుండి వచ్చిందో తెలీదు. ముందు—వెనుకా ఆలోచించలేదు. తరువాత ఏమవుతుంది అని కూడ లేదు

నేను మంజులత చేతిని విడువకుండా 'మంజూ' అంటూ ఆమె చేతిని హృదయానికి హత్తుకున్నాను.

"ఛ ! ఇదేమిటి. వదలండి. మీ చెల్లెలు చూస్తే ఏమనుకుంటుంది" అని అంది.

ఈమాట ఆమె మందలించినట్లుగా ఉన్నవి గాని కోపంగా అన్నట్లు లేదు.

"మా చెల్లి అప్పుడే రాదులే" అని రెండో చేతిని కూడా తీసుకున్నాను.

"మరీ అంత చొరవ పనికిరాదు... చూడవే నళినీ మీ అన్నయ్య ఏమి చేస్తున్నాడో"

"ఏమి చేస్తున్నా డేంటి" మా చెల్లి వచ్చింది. "రహస్యాన్ని కదానిని చేసి చూడు ఎలా తప్పు అడుతున్నాడో, రెడ్ను కొట్టకుండా బ్లాక్ను కొడుతున్నాడు" అంది.

"హమ్మయ్య" అనుకొన్నాను నేను.

(జడ్జీగారు కాస్సేపు ఆగారు. మరలా మొదలు పెడుతూ) 'రామం! జాగ్రత్తగా విను. ఇప్పటికి ఒక అధ్యాయం అయింది. మరో అధ్యాయం మొదలు. ఆరోజునుండి పూర్తిగా నా దినచర్య మారిపోయింది.

ఆరోజునుండి మంజులత ప్రతిరోజూ మా యింటికి వచ్చేది. నాకు ఫిజిక్సు అర్థం గావటం లేదు చెప్పమని కూర్చునేది. నే నలాగే చెబుతుండే వాడిని. మంజులతకు ఫిజిక్సు పాఠము మా ఇంటికి రావటానికిగాను సాకు దొరికిందని తెలుసుకోటానికి నా కెన్నో రోజులు పట్టలేదు. ఎక్కువగా మా యింటిదగ్గర మంజులత నాతోనే కాలం గడిపేది. ఒకరోజు మా చెల్లి అడిగింది.

"మంజూ .... మా ఇంటికి నువ్వు నాకోసం వస్తున్నావా ? మా అన్న కోసమా" అని.

"అవును పాపం. మీ అన్నయ్యంత అందగాడు ప్రపంచంలో లేడని. ఇట్లా మాట్లాడితే రేపటి నుండి నే నసలే రాను" అంది లత.

"అదేంటి నళినీ ! అవేం మాటలు ?" అన్నాను నేను.

"అయితే ఇద్దరగా ఒకటయ్యారన్నమాట అయితే నే నెందు కిక్కడ" అంటూ లోనికి వెళ్ళింది.

మంజులత నావైపు చూసి నవ్వింది. నే నామెను అడిగాను. "ఏం! మంజూ నీ వెవరికోసము వస్తున్నావు "

"ఏం ! మీకోసము రాకూడదా" అంది.

అంతే ! ఒక్కసారి 'మంజూ' అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాను.

ఆ సంవత్సరమంతా ఎలా గడిచిందో నాకే తెలీ లేదు. మంజులత సాంగత్యంతో మధురంగా గడిచి పోయినవి. ఎఫ్. ఎల్. పరీక్షలు అయిపోయినవి. మా చెల్లాయి సెలవులకు మామా రెళ్లిపోయింది. కాని నేను వెళ్లలేదు. సెలవులెంతో సరదాగా గడిచి పోయినవి.

ఆ శలవుల్లోనే మంజులత నన్ను ప్రొఫెసరు గారికి పరిచయం చేసింది తన స్నేహితురాలి బ్రదర్ నంటూ. అలా నేను ప్రొఫెసర్‌గారి కుటుంబంలో వారందరికీ ఆప్తుడ నయ్యాను.

సెలవు అనంతరము కాలేజీలు తెరిచారు. మా చెల్లి వచ్చింది. రోజులు మామూలుగానే గడుస్తున్నవి. మా చెల్లి మాత్రము మంజులతతో నా సంబంధము కొద్దిగా పసికట్ట సాగింది. కాని అడుగ లేదు. ఒకనాడు మా చెల్లి కాలేజీనుండి వచ్చి 'ఏరా అన్నయ్యా .... వదినను ఏమైనా అన్నావా! కోపంగా ఉంది' అంది

'వది నెవరు ?'

'ఎవరేమిటి ? మంజులత' అని ఫకాలున నవ్వింది.

నేనేమీ సమాధానం చెప్పలేదు.

మా ప్రణయం పెళ్లివరకు దారితీసింది. 'ఎట్టి పరిస్థితులలోనైనా సరే మా పెళ్లి జరిగి తీరవల్సిందే' అని నిశ్చయించుకొన్నాము. ఈ సంగతి చూచాయగా మా ప్రొఫెసరుగారి వరకూ పోయింది. ఆయన మవునంగానే ఉన్నాడు. ఆయనకు కూడ మా పెళ్లి యిష్టమేనని విశ్వసించుకొన్నాము.

**ఇక మాకు పట్టపగ్గాలు లేవు.**

పరీక్షలు బాగానే వ్రాశాము. ఇక మాకు మా ఆనందానికి అవధులు లేవు. ఆ ఆనందంలో మంజులత సర్వం నాకర్పించివేసింది. మా రిజల్ట్సు వచ్చాయి. అంతా ఫస్టు క్లాసులో ప్యాసయ్యాము. ఇంక మాకు కావలసిం దేముంది .....

పేపరులో ఏదో 'ఫారిన్ స్కాలర్‌షిప్' ప్రకటిస్తే దానికి అప్లయి చేశాను. వెంటనే వచ్చింది. నా ఆనందానికి మేరలేదు. మంజులత నాకన్నా ఉత్సాహంగా ఉంది. ప్రొఫెసరుగారు 'అదృష్టవంతుడు' అన్నారు.

'ఫారిన్ స్కాలర్‌షిప్' ఎచ్చిందని ఒకవైపు ఉత్సాహంగా ఉన్నా మరొకవైపు ఎంతో దిగులుగా ఉంది మంజులతను వదిలిపోవాలంటే. ఈ విషయంలో నాకంటే ఏంతో దిగులుగా ఉంది మంజులత. ఏమి చెయ్యలేక ప్రతిదానికీ మౌనం వహించేది.

"ఏం, మంజూ....వెళ్లమంటావా ? నీ కిష్టం లేకపోతే వెళ్లను" అన్నాను.

సమాధానంగా రెండు కన్నీటి చుక్కలు కార్చింది.

"మంజూ ! రెండు సంవత్సరాలేగా ఎంతసేపట్లో తిరిగి వస్తాయి ?"

"సీట ముంచినా, పాల ముంచినా మీదే భారము. పూర్తిగా మిమ్ములనే నమ్ముకున్నాను" అంటూ హృదయంపై వాలి ఎక్కి ఎక్కి ఏడువసాగింది.

"మంజూ... ఏమిటిది ...చిన్న పిల్లకు మాదిరిగా. చిరునవ్వుతో సాగనంపాలి గాని .... నిన్ను వదిలి వెళ్లటము నాకూ ఎంతో కష్టంగా ఉంది. ఏదీ ఒక్క చిరునవ్వు. ఊ"

మంజు లేని చిరునవ్వు తెచ్చుకుని కన్నీళ్లతో సాగనంపింది.

ఆ సంవత్సరం మంజూ, మా చెల్లి బి. ఎస్‌సి. లో చేరారు

నేను విదేశాలకు వెళ్ళిపోయాను.

తరచూ ఉత్తరం వ్రాస్తుండేవాడిని నేను మంజులతకు. ఆమె కూడా వాటికి సమాధానం వ్రాస్తుండేది. ఒక్కసారిగా మంజులత దగ్గర నుండి ఉత్తరాలు 'బంద్' అయిపోయినవి. ఈ హఠాత్ పరిణామానికి తట్టుకోలేక పోయాను. మా చెల్లికి వ్రాశాను. 'మంజులత పది రోజుల నుండి కాలేజీకి రావటంలేదని' వివరాలు త్వరలో వ్రాస్తానని' వ్రాసింది.

ఆ తరువాత ఒకవారము రోజులకు మా చెల్లి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరమే నా జీవితాన్నంతా మార్చివేసింది. ఆ ఉత్తరములోని ముఖ్య విషయ మేమంటే 'మంజులతకు పెళ్లి ఖాయమైందనీ, ఇంకో నాలుగు రోజుల్లో పెళ్ళనీ అంటే ఆ ఉత్తరము నాకు చేరే సమయానికి మంజులతకు పెళ్లి అయిపోయి ఉంటుంది. నేను నిశ్చేష్టుడనై కుర్చీలో కూలబడిపొయ్యాను. నోట మాటకూడ రావటంలేదు. మంజులత...ఎందు కిట్లా చేసింది ? నేనేమి అన్యాయం చేశాను ? నాకు మాట మాత్రమైనా తెలుపలేదే ! ఇంక నేను చదివి లాభం ఏమిటి ? ఎవరికోసము. ఆరోజు

# జడ్జిగారి తీర్పు

నుండి పిచ్చివాణ్ణిగా తయారయ్యాను. ఎవరితో మాట్లాడేవాడిని గాదు. అలాగే కళ్లప్పగించి చూసేవాడిని. నామిత్రులు నాకు పిచ్చి పట్టిందనుకున్నారు. ఎక్కువ అయిందే కాని తగ్గలేదు. "మంజూ ! ఎందుకిలా చేశావు ? నేనేమి చేశాను ? నా కీ ఘోర శిక్ష ఎందుకు విధించావు" అంటూ ఉత్తరము వ్రాశాను. కాని సమాధానం లేదు.

ఎక్కడలేని మొండి ధైర్యము నాలో ప్రవేశించింది. కాని మంజులతను మాత్రము మర్చిపోలేక పోతున్నాను. ఆనాటినుండి స్త్రీజాతిమీద ఒక ద్వేషం జన్మించింది. ప్రతి స్త్రీ....ఇంతేనా.... ప్రేమించినవారిని మోసం చెయ్యటము... మొదట ప్రేమించటమే బుద్ధి తక్కువ..... నేను ఎదు సంవత్సరాల వరకూ ఫారిన్‌నుండి రాలేదు. వచ్చి ఏంచేయను ? తర్వాత స్వదేశంపై మమకారంచేత తిరిగి వచ్చాను. పది సంవత్సరాలు ప్లీడరుగా పని చేశాను. తర్వాత జడ్జి అయ్యాను. నాకు స్త్రీ జాతిమీద కల ద్వేషం చేతనే నేను వివాహం చేసుకోలేదు. నాటికీ, నేటికీ నన్ను పీడించేది ఒక్కటే.... అది....నన్ను మంజులత ఎందుకు నిరాకరించింది..... నాలోగల తప్పేమిటి. తప్పుంటే చెప్పవచ్చుగా.

రామం ! నాటినుండి మంజులత నాకు కనపించలేదు. వెదికినా ఫలితము శూన్యమే అయింది. ఆమె నా కెప్పుడు కనిపించినా నేను అడిగేది ఒకే ఒక ప్రశ్న అదే. "ఆమెకు నేనేం అన్యాయం చేశాను. నా కీ శిక్ష ఎందుకు ?" అని మాత్రమే. ఈ ప్రశ్నకు సమాధానం లభించనంతకాలం నాకు మనశ్శాంతి ఉండదు. నాలో నేను ఎంత కుమిలి పోతున్నానో ఆ భగవంతుడికే తెలియాలి. నేను విదేశాలనుండి వచ్చిన కొత్తలో ఎన్నో సంబంధాలు వచ్చినవి. కాని నాకు మనశ్శాంతి లేదు. అటువంటప్పుడు ఇంక పెళ్ళెందుకు. మా చెల్లాయి ఎన్నోవిధాల చెప్పింది. మంజులత కాకపోతే ఆమెను మించినామె ఇంకొకతె అని. కాని నా హృదయ మెలా ఒప్పుతుంది. ఆ గోలనుండి తప్పుకోవటానికే ఒకనాడు ఇంటినుండి వచ్చేశాను. కాని ఆ ఒంటరితనము మరీ బాధపెట్ట సాగింది. కాని నేనేం చెయ్యను అలా మంజులతను గూర్చి బాధ పడటము తప్ప నే నింకేమీ చెయ్యలేకపొయ్యాను. అలాగే రోజులు గడుస్తున్నవి. కాని రామం హఠాత్తుగా .... మంజులత, నా మంజు నిన్ననే కన్పించింది. ఇంతటి దీనస్థితిలో ఆమెను చూస్తానని నేను కలలోకూడ అనుకోలేదు. రామం, చూడు ఆ మంజులతే ఈమె. ఇప్పుడు నీ ఎదురుగా కూర్చున్న స్త్రీయే ...." (అని ముగించారు జడ్జిగారు).

"ఆ !" అన్నాను ఒక్కసారి నోరు తెరచుకుని. అప్రయత్నంగా ఆమెవైపు చూశాను.

ఆమె కళ్లు అశ్రువులతో నిండిపోయాయి. చెంగుతో తుడుచుకుంటోంది.

ఇంతలో ఆమె హీనస్వరంతో "జడ్జిగారూ! ఇహ మిమ్ములను పేరుతో పిల్చే హక్కు లేదు. అది నే నెప్పుడో కోల్పోయాను. నా అంత దురదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఉండదు. మీ ప్రశ్నకు సమాధానం చెబుతా వినండి. ఆ పరిస్థితులలో ఎవరైనా అలాగే చేయవలసి వచ్చేదేమో. పరిస్థితుల ప్రాబల్యం అట్టిది" అని చెప్పసాగింది.

## ఆమె చెప్పినకథ

నాకు ప్రసాద్‌తో అంటే జడ్జిగారితో మొట్ట మొదటసారిగా కొండమీద పరిచయమైంది. అసలు అది పరిచయ మనటానికే వీలులేదు. ఏదో మేము నలుగురము ఉన్నాం కదా యని ఒంటరిగా ఉన్న అబ్బాయిని ఏడిపించటానికి మేము చేసుకొన్న పరిచయమే. ఆ తరువాత వారిని కోవెలలో చూచాను. ఎందుకో వారిని చూడగానే ఒక సద్భావం నాలో కలిగింది. అది ఎందుకు కలిగిందో చెప్పలేము. కాని వారు అన్న మాటలు వినగానే వారిమీద కలిగిన భావం హారతి కర్పూరంలా హరించుకుపోయింది. నాకు ఎక్కడలేని కోపము వచ్చింది. ఒంటరిగా ఒకరిద్దరమ్మాయిలు కనిపిస్తే అంత హేళనా .... తగిన శిక్ష చెయ్యా లనుకున్నాము. కాని వే మేం చెయ్యగలము.

ఆ తరువాత నేను కాలేజీలో ఇంటర్మీడియేట్‌లో చేరాను. చేరిన వారం రోజులకే నళినితో పరిచయమైంది. ఒకనాడు నేను నళిని ఇంటికి వెళ్లాను. నే నక్కడ నళిని అన్న ఫొటోను చూచాను అత నెవరో కాదు. కోవెలలో నన్ను హేళన చేసినతనే. అతనిని గూర్చిన వివరాలన్నీ తెలుసుకున్నాను. పేరు, ఏమి చేస్తున్నది వగైరా. పాపం! నళిని కేమి తెలుసు. అన్నీ చెప్పింది.

నేను ఇంటికివచ్చి ఎంతోసేపు ఆలోచించాను. అతను ఎఫ్. ఎల్. చదువుతున్నాడు. మా ఫాదర్‌లా ప్రొఫెసరు ఈ విషయము మా ఫాదర్‌తో చెబితే అతన్ని డిస్‌మిస్ చేసెయ్యగలడు. మొట్టమొదట అలాగే చేద్దామనుకొన్నాను. కాని పాపం ! నళిని. ఆమె కింత ద్రోహమా. అమె కీ విషయం తెలిస్తే అన్నగారిని గూర్చిన వివరాలన్నీ చెప్పేదా. అప్పుడతనిని నేనేం చెయ్యగలిగేదానిని. అయినా అతని నన్న దానిలో అంత తప్పుకనిపించటంలేదే. ఏదోతనను హేళనచేసి నందుకు ప్రతిఫలంగా ఆ పగ తీర్చుకోడానికి అన్నాడు గాని లేకపోతే చాలా మంచివాడుగా కన్పిస్తున్నాడు. అయినా ఈ రోజుల్లో ఇదొకఫ్యాషనయిపోయింది. ఒంటరిగా పోతున్న అబ్బాయిలను అమ్మాయిలు ఏడిపించటము, అమ్మాయిలను అబ్బాయిలు ఏడిపించటము. అంతా లోక సహజము. ఇప్పు డీ విషయము నాన్నతో చెబితే అతని జీవితం వృధా అయిపోతుంది.

నేను రెండురోజుల కొకసారైనా నళిని ఇంటికి వెళ్లేదానిని. నేను ఇదివరకే చెప్పి అతనిని చూస్తే ఒక సద్భావం కలిగిందని. అది రోజురోజుకు అభిమానంగా మారజొచ్చింది. కాని ఇంతవరకు ఒకసారి కూడా అతనిని ఇంటిదగ్గర కలుసుకోలేదు.

మా ఇంటి ప్రక్కన ఫిజిక్సు లెక్చరర్ ఒక డుండేవాడు. ఆయన తమ్ము డొకడు మా కాలేజిలో బి. ఎ. చదువుతుండేవాడు. వాడు రోజూ నేను

కాలేజీకి బయలుదేరితే నా వెంబడే తయారు. నేను బయటికి వెళ్ళితే చాలు నా వెనకాలే రెడీ. నాకు మహా చిరాకేసేది. నేను మా నాన్నతో చెబుదా మనుకున్నాను ఈ విషయం. కాని పరిస్థితులు ఎలా విషమిస్తాయోనని కొన్ని రోజులు ఆగాను. తరువాత ఒక వారం రోజులకు నాకు వాడి దగ్గర నుండి ఒక ఉత్తరం వచ్చింది. "నీవే నా స్వప్న సుందరివి. నా ఊహా సుందరివి మంజూ! నీ తోడిదే లోకము. నీవు లేనిదే ఒక్క నిముషం బ్రతుకలేను. నన్ను కరుణించవా. నీ మృదుమధుర మంజుల దరహాసము నాపై ప్రసరింపజేయవా" అని ఇంకెన్నో అసభ్యపు మాటలతో నిండివుంది.

నా కోపము కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్న నదిలా పొంగిపోయింది. వెంటనే ఆ ఉత్తరం మా నాన్నకు చూపించాను. ఆయన ఆ ఉత్తరం తీసుకుని ఆ లెక్చరర్‌ను అడిగాడు. ఆ లెక్చరర్ "మావాడు మాత్రము ధైర్యము చేసేవాడు కాదే. ముందేదో మీ అమ్మాయే వ్రాసి ఉంటుంది. అందుకనే వాడు సమాధానం వ్రాశాడు" అన్నాడు.

మా నాన్న అవమానంతో తిరిగి వచ్చాడు నాకేమి చెయ్యాలో తోచలేదు. ఒకనాడు కాలేజీలో 'ఫంక్షన్' జరుగుతూండటమువల్ల నేను ఇంటికి ఆలస్యంగా వస్తున్నాను. టైము సుమారు తొమ్మిదయింది వీధంతా నిర్మానుష్యంగా ఉంది. వెనుక నుండి 'మంజూ' అంటూ ఎవరో పట్టుకున్నారు. వెనుతిరిగి చూచాను. వాడు లెక్చరర్ తమ్ముడు. అంతే! అప్పుడు నాకా బలము ఎలా వచ్చిందో చెప్పలేను.

'చెళ్లు' మని రెండు చెంపలూ వాయించాను కోపంతో.

బహుశ వాడీ సంఘటనను ఊహించిఉండడు. చిత్తరబోయి నిలబడ్డాడు. నేను గబగబా ఒక్క క్షణం నిలబడకుండా వెళ్లిపోయాను.

"హు! ఉండు. నీ సంగతేదో తేలుస్తా" అన్న మాటలు వినబడ్డాయి వెనుక నుండి. నాకు చాల భయం వేసింది. ఈసారి ఒంటరిగా చూసి ఏమి చేస్తాడోనని.

కాని ఈ సంగతి మాత్రం ఇంట్లో చెప్పలేదు.

ఒకనాడు నళిని అన్నయ్య ప్రసాద్ మా ఇంటికి వచ్చాడు. నన్ను చూసి మూర్ఛపోయినంత పని చేశాడు. నేను ప్రొఫెసర్ కూతురినని తెలిసిన తరువాత అతని బాధ వర్ణనాతీతము. అతను మా యింటికి ఎందుకు వచ్చిందీ అర్థంకాలేదు. అతని బాధ చూస్తుంటే నా కెంతో నవ్వు వస్తుంది....ఒకవైపు జాలి కూడా వేసేది...కాని నే నప్పటికే నిశ్చయించుకొన్నాను ఆ విషయం ఫాదర్‌తో చెప్పవద్దని. ఆ విషయం ఆయనతో చెబితే నమ్మితేగా...

ఆ మరుసటిరోజు నళిని ఇంటికెళ్ళినా మళ్లీ ప్రసాద్ ఇదే గొడవ. నమ్మకానికిగాను చేతిలో చెయ్యి వేశాను. ప్రసాద్ నా చేయి హృదయానికి హత్తుకున్నాడు....నా కది ఎలాగో అన్పించింది. పురుషస్పర్శ ఎరుగని నేను నన్ను నేను మర్చిపోయాను. ఒక విధమయిన ఆనందంలో మునిగిపోయాను.

ఇంటికి వెళ్లి ఆలోచించాను నేనేమైనా తప్పుడుపని చేస్తున్నానా అని. కాని నాకేమీ తప్పుగా కన్పించలేదే. నాకు నచ్చినవానిని నేను ఆదరిస్తాను.... గౌరవిస్తాను.. కావాలంటే ఇంకేదైనా యిస్తాను ...ప్రసాద్‌కేమి తక్కువ....అందంలోనా... చదువులోనా.

ఆరోజునుండి రోజూ నళిని ఇంటికి వెళ్ళేదానిని. ఇప్పుడు నళిని ప్రసాద్ ఇంటికి వెళ్లటానికి సాకు మాత్రమే. ఫిజిక్సు చెప్పమని చెప్పించుకునే దానిని ప్రసాద్‌చేత. ప్రసాద్ దగ్గర కూర్చోవచ్చు ననే నెపంతో....రానురాను ప్రసాద్‌ను చూడకుండా ఒక్క క్షణము కూడా ఉండలేకపోయే దానిని. ప్రసాద్ పరిస్థితి కూడా అలాగే తయారయింది....నళిని కొద్ది కొద్దిగా మా పరిస్థితి గ్రహించింది....కాని ఏమీ అనలేదు. అప్పుడప్పుడు ఆమె హాస్యంగా "వదినా" అని పిలిచేది. కాని ఆ మాటంటే నళినిమీద విరుచుకుపడేదానిని పైకి మాత్రమే....కాని మనసులో ఎంత సంతోషపడే దానినో చెప్పలేను. ఆ మాటే మరల నళిని ఎప్పుడు అంటుందా అని ఎదురుచూచే దానిని.

ప్రసాద్, నేనూ రెండు సంవత్సరాలు ఎంతో ఆనందంగా గడిపాము. మా ఆనందానికి అవధులు లేవు....వచ్చే వేసవిలోనే పెళ్లి చేసుకోవా లనుకున్నాము. పరీక్షలు అయిపోయాయి. బాగా వ్రాశాము. ఇంక కావలసిం దేముంది. కావలసినంత స్వేచ్ఛ. మా వివాహ విషయము కొద్దికొద్దిగా మా నాన్నగారికి కూడా తెలిసింది. ఆయన నేమీ మాట్లాడలేదు. ఇక మా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. కాలం ఎలా గడుస్తుందో కూడ మాకు తెలీటంలేదు. ఆ సంతోషంలో నా సర్వస్వం ప్రసాద్‌కు అర్పించివేశాను.

ప్రసాద్‌కు ఫారిన్ స్కాలర్‌షిప్ వచ్చినప్పుడు మేమెంత ఆనందించామో అంత విచారము కూడ తోడైంది. ఒకరిని ఒకరు విడిచి ఉండాలి గదా! యని. ఈ విషయము తలుచుకున్నప్పుడల్లా నే నెంత ఏడ్చేదానినో చెప్పలేను. కాని ప్రసాద్‌ను "ఫారిన్" ప్రయాణం మానుకోమని అనలేను.

"'ఫారిన్' ప్రయాణం అంటే మాటలా. ఈసారి ఛాన్సు పోతే మరలా రాదుమంజూ. రెండు సంవత్సరాలు. ఇట్టే తిరిగి వస్తాయి....నీవుకూడా యిలా భయపడిపోతే ఎలా. ధైర్యంగా పంపాలి గాని" అంటూ బుజ్జగించాడు ప్రసాద్.

నేను కన్నీళ్లతోనే ప్రసాద్‌కు వీడ్కోలు యిచ్చాను.

'రామం! జాగ్రత్తగా విను. ప్రసాద్‌గారూ! మీరు కూడా. మీ ప్రశ్నలకు సమాధానం కూడ ఇందులోనే ఉంటుంది. ఆరోజే పూర్తిగా నా అదృష్టమో..దురదృష్టమో కాని చెప్పలేను...మార్చి వేసింది. కాస్త జ్వరంగా ఉంటే డాక్టరు దగ్గర కెళ్లాను. డాక్టరు పరీక్షించి చెప్పాడు.

"అమ్మా! మీరు కాలు జారారమ్మా."

నాకు అర్థం కాలేదు. "అంటే ?"

"ప్రస్తుతము మీరు గర్భవతులు."

నే నిక వినలేకపొయ్యాను. మూర్ఛ వచ్చినంత పనయింది. ఇంటికి ఎలా వచ్చానో నాకే తెలీదు. అలాగే మంచంమీద పడిపొయ్యాను.

"అయ్యో! నా తల్లీ! ఎంతపని చేశావే. పరువు ప్రతిష్ఠ గంగలో కలిపావే" అని లబోదిబోమంటూ మా తల్లి వచ్చింది.

ఇంక ఇప్పుడెన్ని అనుకొని ఏం లాభము. చేయగలిగిందేముంది.

నా తండ్రి నామీది ప్రేమచేత తనలో తనే కుమిలిపోవటమే గాని నన్నేమీ అనలేదు.

నాకు తెలుసు.. ఈ గర్భము నాకు ప్రసాద్‌వల్ల వచ్చిందే నే నెంత తొందరపడ్డానో ఇప్పుడు తెలిసింది. ఎంత అవినీతి పనికి తలపడ్డానో ఇప్పు డర్థమయింది. ప్రసాద్ రావటానికి ఇంకా రెండు సంవత్సరాలు పడుతుంది. ఈ సంగతి అతనికి తెలియపరుస్తే .... నేను అలాగే చేద్దా మనుకున్నాను. ఎప్పటికైనా ప్రసాద్ నా వాడేనని ధైర్యము నాకుంది.

మా అమ్మా—నాన్న తర్వాత విషయము ఏమిటని ఆలోచిస్తున్నారు. మా హోం డాక్టరు ఎన్నో సలహాలు యిచ్చాడు.

'ససేమిరా' నేను వాటికి ఒప్పుకోలేదు. నన్ను నమ్మి ప్రేమించిన ప్రసాద్ సంతతికి ఇంత ఘోర శిక్షా. నేను ఒప్పుకోలేదు. రెండు సంవత్సరా లాగితే ప్రసాద్ వస్తాడు. అప్పుడు మే మిద్దరం మ్యారేజి చేసుకుంటాము అని చెప్పాను.

మా అమ్మా—నాన్న నామీద ఎగిరి పడ్డారు. "చేసిన నిర్వాకం చాలక ఇంకా రెండు సంరాలు ఆగుతుందట. రెండు సంవత్సరాలు. అప్పదాక మా తలలు ఎత్తుకు తిరుగ నవసరంలా పరువు ప్రతిష్ఠ ఆలోచించ నవసరంలా. వెంటనే డాక్టరు చెప్పింది చేయవలసిందే" అన్నారు.

నా ప్రాణం పోయినా సరే నేనా పనికి ఒప్పుకో నన్నాను.

మా తల్లిదండ్రులు ఈ అపనింద మాపుకోవటానికి నాకు పెళ్లి చేయటానికి సంబంధాలు వెతుకసాగారు.

నా పరిస్థితి ముందు నుయ్యి—వెనుక గొయ్యిగా తయారయింది.

నా యిల్లే నాకు ఖైదీ అయిపోయింది.

ఆ తరువాత ఇరవై రోజులకు నా పెళ్లి సుధాకరుతో జరిగిపోయింది నా యిష్టం లేకుండానే.

నేను నా ప్రసాద్‌కు ఎంతో అన్యాయం చేశాను. నన్నే సర్వస్వమని నమ్మిన వాడికి ఎంతో ద్రోహం చేశాను. కాని అది నేను చేసిందా. ఇంకెవరైనా ఆ పరిస్థితులలో ఏమి చెయ్యగలిగేవారు ? నేను రోజూ ఎంత ఏడ్చేదానినో లెక్కలేదు. కాని నా గోడు వినేవారే లేకపొయ్యారు. నాలో జీవం నశించింది. ఎవరు పిల్చినా పలికేదానినే కాదు. మౌనమే అందరికీ సమాధానం. చివరికి ఏడ్చేందుకు కూడా నాలో సత్తువ లేదు.

సుధాకర్ నన్ను తీసుకువెళ్లి మద్రాసులో కాపురం బెట్టాడు. ఇదివరకూ ప్రసాద్, నేనూ అనుకొనేవాళ్లము. మద్రాస్ ఎంతో అందంగా వుంటుందని. మెరీనాబీచ్ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంటుందని. ..కాని ప్రస్తుతం నేను మద్రాసులోనే వున్నాను .నాటిని చూస్తుంటేనే

(44-వ పేజీ చూడుడు)

వెగటనిపించింది. సుధాకర్‌తో సరిగా మాట్లాడలేక పోయేదానిని ఒక్కోసారి సుధాకర్ ఆ మౌనాన్ని భరించలేక పొయ్యేవాడు ప్రేమగా "మంజూ! ఏమిటలాఉంటావు ఎప్పుడూ. నేనంటే నీ కిష్టంలేదా. చెప్పు మంజూ. నిన్ను కావాలని చేసుకున్నాను దానికి ప్రతిఫలమామంజూ అంటూ బుజ్జగిస్తూ అడిగేవారు

కాని నేనేమి చెప్పగలను అతనిహృదయంపై వాలి ఎక్కిఎక్కి ఏడ్చేదానిని అంతకన్నా ఇంకేవి సమాధానం చెప్పలేకపోయేదానిని. అతనెంతో కంగారుపడిపోతుండేవాడు ఏమిటి మంజూ ఏమయింది" అనేవారు కంగారుగా నేనేమి చెబుతాను జరిగిన సంఘటన చెబితే నా జీవితం ఏమవుతుంది సుధాకర్ నన్ను స్వీకరిస్తాడా అంత విశాలహృదయుడా. ముందు సంఘం బ్రతుకనిస్తుందా "మీరు రోజూ ఆలస్యంగా వస్తున్నారు. నాకు భయంగా ఉంటుంది" అని తప్పించుకొనే దానిని

"పిచ్చి లతా! ఎంత అమాయకురాలివి" అని ముద్దాడేవారు

నా పెళ్లి అయిన ఎనిమిది నెలలకు రఘు పుట్టాడు అప్పుడు మా యింట్లో ఒక కల్లోలం రేగింది ఇది సంభవమా అని కొన్ని కొన్ని సమయాలలో జరుగవచ్చని డాక్టర్లు చెప్పారు అంతటితో మావారి అనుమానము తీరిపోయింది

ప్రసాద్ ప్రతిబింబమయిన రఘుని చూచి కాలం గడపసాగాను కాని, ప్రసాద్‌ను ఎలా మర్చిపోగలను సుధాకర్‌ను సాధ్యమయినంతవరకు తప్పుకు తిరిగేదానిని ఎప్పుడూ రఘు పోషణలో నిమగ్నమై యుండేదానిని అదంతా సుధాకర్ మాతృప్రేమ అని సరిపెట్టుకొనేవాడు పాపం! ఈ విషయం తెలిస్తే ఏమి చేస్తాడు అని అనుకొన్నప్పుడల్లా భయం వేసేది ప్రసాద్‌ను ఎంత మర్చిపోదామన్నా నా కది వీలుగాని పని అని చివరికి తేలిపోయింది

అలాగే రెండు సంవత్సరాలు ఎంతో కష్టంగా గడిచిపోయింది సుధాకర్‌కి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పని. వారికి విజయవాడ బదిలీ అయింది

అప్పుడప్పుడూ ఆలోచించేదానిని. ప్రసాద్ ఇప్పుడేమి చేస్తుంటాడు ఈ సరికి ఫారిన్ నుండి తిరిగి వచ్చిఉంటాడు నన్ను గూర్చి ఎంత అపోహ పడతాడు నన్ను క్షమిస్తాడా. అతని కెంత అన్యాయం చేశాను ఇలా అనుకొన్నప్పుడల్లా తెలీకుండా అశ్రువులు జలజలా రాలేవి నా కెప్పుడయినా పరిస్థితుల ప్రాబల్యంవల్ల తటస్థపడితే అతనికేం సమాధానము చెప్పకోవాలి అప్పుడు నా జీవితం ఎలా మారుతుంది. సుధాకర్ క్షమిస్తాడా

ప్రసాద్ నాకు జీవితంలో కనుపించకుండా ఉంటేనే మంచిదిగా కనుపిస్తున్నది. కాని మన క్షోభ ఎవ రాపగలరు? ఒక్కసారయినా ప్రసాద్‌ను కలుసుకొని పరిస్థితులు వివరించి అతనిని క్షమాపణ వేడుకొంటేనే గాని నా మనస్సు శాంతించేటట్లు లేదు. కాని ప్రసాద్ ఎలా కన్పిస్తాడు

ఒకనాడు మావారు తన స్నేహితునిని ఇంటికి

# జడ్జీగారి తీర్పు

(29 వ పేజీ తరవాయి)

తీసుకు వచ్చారు కాఫీ తీసుకు రమన్నారు నన్ను నేను తీసుకువెళ్లి ఇచ్చాను అతనిని ఎక్కడో చూచిన గుర్తుగా ఉంది ఎంతోసేపు ఆలోచించాను విశాఖపట్నంలో మా ఇంటి ప్రక్కనున్న ఫిజిక్సు లెక్చరర్ తమ్ముడు ఒక్కసారిగా నేను చలించిపోయాను నా కథంతా కొద్ది కొద్దిగా అతనికి తెలుసు వాడీకథ సుధాకర్‌తో చెబితే వాడి వాలకము చూస్తే నన్ను గుర్తించినట్లుగానే ఉన్నాడు

ఆ రాత్రి నిద్రే పట్టలేదు నాకు వాడు సుధాకర్‌తో జరిగిన విషయం చెప్పినట్లు, సుధాకర్ నన్ను వదిలేసినట్లూ, నేను ఏకాకిగా, దిక్కులేని దానినిగా ఉన్నట్లు కలలు రాసాగాయి ఆ రాత్రి ఎలా గడిచిందో ఇప్పటికీ గుర్తులేదు తెల్లవారిన తరువాత జరిగిన విషయమంతా సుధాకర్‌తో చెప్పి క్షమాపణ కోరుకొందామా అనిపించింది ఒక వేళ సుధాకర్‌తో అతనీ విషయం చెప్పకపోతే. అనవసరంగా నేను బయట పెట్టటము అవుతుంది సుధాకర్ అంత విశాలహృదయుడు కాకపోతే నా జీవితం ఏమవుతుంది భవిష్యత్తు తలచుకొంటే అంతా శూన్యంగా కనపడింది ఏమి చెయ్యాలో తోచటంలేదు భగవంతుడు నాకీ విషమ పరిస్థితులను ఎందుకు కల్పించాడో అర్థంగావటంలేదు మనస్సు నిరాశ చేసుకుని అవనున్నది కాకమానదు అని గుండె అరచేత బట్టుకుని ఏ రోజు ఏమి జరుగుతుందోనని ఆందోళనగా నాలుగు రోజులు గడిపాను ఐదవ రోజున,

"సుధాకర్" అంటూ చొరవగా లోని కెవరో వచ్చారు

"లేరు" అని చెప్పి ఎవరో అని చూచాను. ఇంకెవరు! నా పాలిట బ్రహ్మరాక్షసుడు. వాడు ఫిజిక్స్ లెక్చరర్ తమ్ముడు

"ఎక్కడి కెళ్లారు?"

"తెలీదు"

"సరే! వాడొచ్చేవరకూ కూర్చుంటాను" అని కుర్చీలో కూర్చున్నాడు

"మిస్టర్! అంత సభ్యత తెలీదూ వారు లేనప్పుడు వచ్చి ఇంటిదగ్గర కూర్చోటానికి"

"అహహ! సభ్యత! కులటలకు సభ్యత కూడ కావాల్సి వచ్చింది మంజులతా! నేను నిజము చెబుతున్నాను విను నేను సుధాకర్ కొరకు రాలేదు నీ కొరకే వచ్చాను నే నింకా నిన్ను మర్చిపోలేదు ఇప్పుడు నీ జీవితం నా చేతిలో ఉంది. కావాలంటే నిన్ను నిమిషంలో నామరూపాలు లేకుండా చెయ్యగలను నీమీద మమత నా కింకా వదల్లేదు. నీ జీవితం బాగుపడాలంటే నే చెప్పినట్లు విను"

'ఛీ నీచుడా! పో ముండవతలకు ఇంత దురుద్దేశంతో వచ్చావనుకోలేదు బయటకు నడు ముందు!" అని కోపంతో అన్నాను

అతను నా మాటలు లెక్కచెయ్యకుండా నన్ను బలవంతం చెయ్యసాగాడు

నాకేమి చెయ్యాలో తోచలేదు అబలను ఒక్కసారి కుర్చీ ఎత్తి వాడి ముఖాన కొట్టి లోపలికి పరుగెత్తి తలుపేశాను.

"మంజూ! ఇదివరకులా నిన్ను వదలదలచుకోలేదు. నాలుగు రోజులు గడువిస్తున్నాను ఈ నాలుగు రోజుల్లో నీ మనస్సు మార్చుకో. లేదా, నీ జీవితం ఖాళీ" అని వెళ్లిపోయాడు.

నన్నీ లోకంలో ఎందుకు పుట్టించావురా దేవుడా' అని ఎంతోసేపు ఏడ్చాను నా కేమీ పాలుపోవటంలేదు నా జీవితం నిలుపుకోవటానికి సంసారం చక్కబరచుకోవటానికి, ఇంత అవినీతి పనికి ఒప్పుకోవాలా. ఇంత నీచమయిన బ్రతుకు లేకపోతేమి. ఇంత నీచపు బ్రతుకు బ్రతికి ఎవరిని ఉద్ధరించటానికి? వెంటనే ఆత్మహత్య గావించుకొందా మనుకున్నాను. కాని మూడేళ్ల రఘుని చూడగానే దుఃఖం పెల్లుబికింది. వాడి నేమి చేసి వెళ్లాలి పెద్దలు చేసిన తప్పుకు పిల్లలు బాధ్యులా. నేను మరణిస్తే సుధాకర్ రఘుని సరిగా చూస్తాడా ఏది ఎలా జరిగినా సరే నే నంత నీచత్వానికి పాల్పడ దలచుకోలేదు

ఒకనాడు సుధాకర్ ఎంతో నీరసంగా ఇంటికి వచ్చారు. పిలిచినా మాట్లాడలేదు. మనస్సంతా ఏదో కలతగా ఉందన్నారు నన్ను విసిగించ వద్దన్నారు. ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. అలాగే నిద్రపొయ్యారు

తెల్లవారింది నేను మావారి గదిలోనికి వెళ్లాను. నే నొక్కసారి కెవ్వున కేక వేశాను ప్రక్కమీద మావారు లేరు వారి శవం మాత్రమే. దిండుపై రెండు కాగితాలు ఎగురుతున్నాయి. ఆత్రుతగా విప్పి చదివాను.

---

తండ్రీ కొడుకులు దారిలో పోతూన్నారు. త్రోవలో ఒక క్రొత్త చెప్పు కనిపించగాకుమారుడు దానిని తీసికొన్నాడు. "నాయనా! పరాయివారి వస్తువు తీసికోకూడదు. తప్పు. దాన్ని అక్కడే వదిలేయ్" అన్నాడు తండ్రి.

మరికొంత దూరం వెళ్ళగా రెండో చెప్పు కనిపించింది. దాన్ని తండ్రి కాలికి తొడిగి సరిపోయిందని తెలిసికొని "ఒరేయ్! పరిగెత్తుకొని వెళ్ళి ఇందాక వదిలేసిన చెప్పు త్వరగా తీసికొనిరా!" అన్నాడు కుమారునితో.

---

మంజూ,

నేను నిన్నెంతగా ప్రేమించానో చెప్ప సలవి గాదు కాని చంద్రునిలో మచ్చ మాదిరిగా నీ జీవితంలో ఇంత కుళ్ళు ఉందని నాకు తెలీదు. నిన్ననే నా స్నేహితుడు నీ గత జీవిత చరిత్రనంతా వినిపించాడు. రఘు నా బిడ్డ కాదు. ఆ విషయం నే నిది వరకే అనుమానించాను. కాని డాక్టర్ల మాటతో నమ్మాను. నే నెంతో పరువు ప్రతిష్ఠలతో బ్రతుకుతున్నవాడిని సుధాకర్ భార్య 'కులట' అంటే వింటూ నేను తిరుగలేను ఆ నిందతో నేను బ్రతుకలేను. అందుకే ఈ లోకమునుండి పోతున్నాను. ఇంక ఎక్కువ వ్రాయదల్చుకోలేదు.

సుధాకర్.

* * *

రెండో కాగితము పోలీసువారికి వ్రాసింది.

ఆనాటితో నా నూరేళ్ల జీవితము నిండి పోయింది. నా పరిస్థితి నాకే భయం వేసింది. ఏమి చెయ్యటానికీ కాలు కదలటంలేదు. సుధాకర్ అమాయకుడు. ఒకరు చేసిన పాపానికి ఇంకొకరు బలి

మా తల్లిదండ్రుల యింటికి వెళ్లటానికి నాకు ముఖం చెల్లలేదు మా అత్త మామలకు సుధాకర్ ఒక్కడే కొడుకు. వారికి తీరని బాధను కలిగించి వెళ్లిపోయారు. నేను కాకినాడలో అత్త, మామల దగ్గర మోడువారిన జీవితంతో రఘుని ప్రాణపదంగా చూచుకుంటూ కాలం గడుపుతున్నాను.

కాలగర్భంలో పదిహేడు సంవత్సరాలు జరిగి పోయాయి అంటే రఘు ఇరవై ఏళ్ళ వాడయ్యాడు. కాకినాడలో బి. యస్‌సి. చదువుతున్నాడు. ఒకనాడు 'రఘు ఉన్నాడండీ' అని ఒక అమ్మాయి వచ్చింది.

"ఎవరమ్మా నీవు"

"రఘు క్లాసుమేట్‌నండి 'పేరు నిర్మల' అంది లేడని చెప్పగానే వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం రఘు నినిర్మలనుగూర్చి అడిగాను. రఘు మాట తడబడ్డాడు. "నీకెలా తెలుసు" అని అడిగాడు.

నేను ఆమె మనింటికి వచ్చిందని చెప్పాను. రఘు ఇక దాచి లాభంలేదనుకున్నాడు. మెల్లగా 'అమ్మా! ఆ అమ్మాయి నా క్లాస్‌మేటు... నిర్మల... చాల మంచిది..... చాల బావుంది నీవు కూడ చూశావుకదూ . మేము మేము ప్రేమించుకున్నాము మెల్లగా చెప్పాడు. ప్రేమనంగానే నా కథ కళ్ళకు కట్టినట్లయింది . . నిర్మల కూడ స్త్రీయే. . . నా కళ్ళ వెంబడి అశ్రువులు రాలాయి.

"ఏం! అమ్మా! ఏమిటి" ఆతృతగా అడిగాడు

అతన్ని కూర్చోబెట్టి నా కథంతా పూసగుచ్చినట్లు చెప్పాను. "ఎవడా తుచ్ఛుడు నీచుడు ... అమ్మా వాడెక్కడ ఉంటున్నాడు వెధవ ... వాడి పేరేమిటమ్మా... ఇప్పుడే వాడి పీక నులిమేస్తాను" కోపంతో అంటున్నాడు రఘు.

రఘుని శాంతింపజేయటానికి నా తల ప్రాణము తోకకు వచ్చింది.

రెండు రోజుల తరువాత రఘు బెజవాడలో తన స్నేహితులు ఉన్నారని వెళ్ళాడు. ఒక వారము రోజులకు వచ్చాడు... మాసిన గుడ్డలతో పీక్కుపోయిన ముఖంతో ..ఎంతో దిగులుగా విచారంతో. "అమ్మా యాభై రూపాయలుంటే ఇవ్వు. గుంటూరు వెళ్ళిరావాలి" అని రఘు ఒక యాభై రూపాయలు తీసుకుని వెళ్ళిపోయారు

ఆ తరువాత మూడు రోజులకు పేపరులో వచ్చింది. "రఘు అనే కుర్రాడు ధర్మారావు అనే వ్యక్తిని హత్య గావించాడు. పట్టుబడ్డాడు" అని.

ఇక జీవితంలో మిగిలిన ఆశ కూడ నశించి పోయింది. ప్రేమించిన ప్రియుడలాగయ్యాడు. కట్టుకున్న భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కన్న కొడుకు హంతకుడుగా తయారయ్యాడు 'పగ' తీర్చు కొనేందుకుగాను.

గుంటూరులో కొన్ని రోజులు ఈ కేసు నడిచింది . .తరువాత హైకోర్టుకు పంపించారు. ఆ కేసులో ముద్దాయే రఘు.. మీ కుమారుడు .. ధర్మారావే ఫిజిక్సు లెక్చరర్ తమ్ముడు ...." అని మంజులత తన కథ ముగించింది.

నేనలాగే బ్రమాసపడిపోయాను ఎంత విషాద గాథ దీనినంతటినీ ఈమె ఎలా భరించగలిగింది? ఎంత సహనము.....

జడ్జీగారు కళ్ళు అశ్రువులతో నిండిపోయాయి. మెల్లగా రుమాలుతో తుడుచుకుంటున్నారు. గద్గద స్వరంతో "మంజులతా.... నన్ను క్షమించు నా వలన్నే నీకీ దశ పట్టింది .... ఆ నాడొక్క తప్పు చెయ్యబట్టేగదా ఈనాడీ దుర్గతి ..ఇంతకాలము నిన్నెంతగానో నిందించేవాడిని నా జీవితం నాశనం చేశావని . కాని నిజంగా నీజీవితమే నేను నాశనం చేశాను" అన్నారు "ఇప్పుడు విచారించి లాభం ఏముంది. ఇందులో తప్పు ఇద్దరిదీను...ఇద్దరికీ భాగం వుంది. ఇద్దరం భాగస్వాములం....అదంతా ఓ పీడకల" అని గంభీరంగా పలికింది.

* * *

ఆ రోజునుండి జడ్జీగారి మనోవ్యాధి ఎక్కువయినట్లుంది ఎప్పుడూ "రామం మంజులతకు నేనెంతో అన్యాయం చేశాను ఆమె జీవితం నా మూలంగా ..బుగ్గిపాలయింది .. దీనికి నాకేమీ శిక్ష లేదా మంజులతకు నేను న్యాయం చేకూర్చలేనా .. ఈ కేసు ఎలాగయినా తప్పుతుందా" అని వాగుతుండేవారు

ఆ రోజే కేసు విచారణ. ముద్దాయి సాక్షులు అంతా విచారించబడ్డారు. సాక్ష్యం ప్రకారం ముద్దాయి హంతకుడే .అందరూ మరణశిక్ష పడుతుందనుకుంటున్నారు

అందరూ జడ్జీగారి తీర్పుకొరకు వేచి ఉన్నారు "ముద్దాయి నిరపరాధి. పరిస్థితుల ప్రాబల్యంవలన ఈ హత్య గావించవలసి వచ్చింది." అని జడ్జీగారు నిర్ణయించారు

కోర్టులో కోతాహలము బయలుదేరింది.

ఆ మరుసటిరోజు నాకు కోర్టులో తెలిసిన విషయమేమంటే జడ్జీగారు రిజైన్ చేశారని.

ఆతురతతో జడ్జీగారింటికి వెళ్ళాను. నరసన్న ఒక కాగితం నాచేతికిచ్చాడు. జడ్జీగారు బయటకు వెళ్ళారంటూ.

రామం,

ప్రస్తుతానికి నాకు ఆప్తుడవు నీవే నా ఇల్లు నీపేర వ్రాశాను ఆస్తినంతా మంజులత—రఘుల పేర వ్రాశాను నేను కోరేది అది వారికి క్షేమంగా అందచేయమని అంతటితో నా పాపం పరిహారమవుతుంది. నేనూ ఋణ విముక్తుడనవుతాను ... నాకోసం ప్రయత్నం అనవసరం, అదంతా వృధా. నేనేమి చెయ్యదలచుకొన్నానో నాకే తెలీదు...ఇప్పటికి నేను విముక్తుడనయ్యాను

ప్రసాద్.

★

---

# వాత్సల్యాపథం

(35వ పేజీ తరువాయి)

వేరే వుండచ్చు" అని లేచి విసురుగా చెయ్యి కడుక్కొని గదిలోకి వెళ్ళి బట్టలు వేసుకోనారంభించాడు సోమశేఖరంగారు తెల్లబోయారు తను ఇంతవరకూ మంచిగా చెప్పుకొస్తుంటే, ఇటువంటి పెడసరపు సమాధానం వస్తుందని వూహించలా. ఆ క్షణంలో కూతుర్ని తీసుకు వెళ్ళిపోదామనిపించింది కానీ అనుభవజ్ఞుడు కాబట్టి రామం కుర్రతనంచేత అలా అన్నాడని, తను వోపికపట్టి ఇంకా ప్రయత్నించాలనీ అనుకున్నాడు.

"ఒరేయ్ రామం పెద్దవాణ్ణి. నీ మంచికోసమే చెబుతున్నాను మిమ్మల్ని కనీ, పెంచి మీకోసం కష్టాలనుభవించి మీరు సుఖపడితే చూసి సంతోషించే వాళ్ళమేగాని పరాయివాళ్ళంకాదు నువ్వు నడుస్తున్న దోవ మంచిదికాదు. '' అని సోమశేఖరంగారు చెప్తూంటే వినిపించుకోకుండా రామం వెళ్ళి పోయాడు, బయటకు.

"ఎందుకు నాన్నా నా గురించి మీరు కూడా బాధ పడ్తారు? ఆ పిల్లల్నిద్దర్నీ తీసుకొని వెళ్ళి పొండి నా మొహాన్ని ఏం రాసుంటే అదే జరుగుతుంది" అంది జానకి.

సోమశేఖరంగారు కూతురివైపు చూశారు ఆయన హృదయం దహించుకుపోయినట్లయింది తను కని పెంచి ప్రేమతో లాలించిన బిడ్డ, పరాయిదైపోయి తనవల్ల తీర్చబడరాని కష్టంలోవుంది. ఆడపిల్లను కన్నందుకు ఇది శిక్ష కాబోలుననిపించింది ఒక్క నిట్టూర్పు విడిచి లేచారు.

రాత్రి మూడు గంటల దాకా తండ్రీ కూతురూ రామంకోసం ఎదురుచూసి చిన్న కునుకు తీసారు. రామం మర్నాడు ప్రొద్దున్న వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకొని బట్టలు వేసుకుంటూంటే జానకి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. త్రాగేసి వెళ్ళి పోయాడు.

సోమశేఖరంగారు రామానికి సామంగా చెప్పి లాభంలేదని నిశ్చయించుకున్నారు. ఇంకొక నాలుగు రోజులుమాసి కూతుర్ని మనవల్ని తీసుకువెళ్ళిపోదామనుకున్నాడు రామం వీళ్లైనంతవరకూ తనను తప్పించుకు తిరుగుతున్నాడు

ఆ వూళ్లో కొంతమంది తెలిసిన వాళ్ళద్వారా రామం నడవడిక గురించి పూర్తి వివరాలు సేకరించారు, సోమశేఖరంగారు, కొందరు ఈ విష